క్లుప్తంగా

ఈత పోటీల్లో బాపట్ల విద్యార్థి ప్రతిభ



బాపట్ల టౌన్: రాష్ట్ర స్థాయి ఈత పోటీల్లో బాపట్లకు చెందిన ఉప్పాల జ్ఞాన వివేక్ సత్తా చాటారు. తిరుపతిలో మంగళవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో అండర్-19 ఈతల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా తరఫున బాపట్ల జూనియర్ కాలేజీ విద్యార్థి ఉప్పాల జ్ఞాన వివేక్ గౌడ్ 200మీటర్ల ఫ్రీ స్టైల్, 50మీటర్ల బట్టర్ ఫ్లై విభాగాలలో రజత పథకాలు సాధించాడు. శిక్షకుడు షేక్ ఖాజామొహిద్దీన్ ఆధ్వర్యంలో ఈతల పోటీల్లో రాణిస్తున్నాడన్నారు. విద్యార్థి వివేక్‌ను పలువురు అభినందించారు.

అయ్యప్ప పడిపూజ

భట్టిప్రోలు: అయ్యప్ప నామస్మరణతో పురవీధులు మంగళవారం మార్మోగాయి. మణికంఠ అయ్యప్ప ఆధ్వర్యంలో స్థానిక అయ్యప్ప స్వామి దేవాలయంలో తెల్లవారుజామున విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. గ్రామోత్సవం అనంతరం దేవాలయంలో పడి పూజ మహోత్సవం నిర్వహించారు. ఈ గ్రామోత్సవంలో అయ్యప్ప దీక్షా పరులు, అయ్యప్ప మాలధారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్న సంతర్పణలో స్వాములతో పాటు దాతలు, శబరిమల అయ్యప్ప స్వామిని దర్శించుకున్న స్వాములు పాల్గొన్నారు. కార్యక్రమాలను అక్కల హరి గురుస్వామి ఆధ్వర్యంలో స్వాములు పర్యవేక్షించారు.

ప్రసన్నాంజనేయునికి విశేష పూజలు

ఐలవరం(భట్టిప్రోలు): స్థానిక వేణుగోపాల స్వామి దేవస్థానంలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి ఆకుపూజ నిర్వహించి హనుమాన్ చాలీసా పారాయణ, భజన, నగర సంకీర్తనలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు దీవి రఘునాథ చక్రవర్తి శాస్త్రయుక్తంగా జరిపారు.

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

పిట్టలవానిపాలెం: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్(ఏపీటీఎఫ్) డైరీ, క్యాలెండర్‌లను ఎంపీడీఓ కొల్లిపర పద్మజ మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకుడు పరిశ నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు మూకిరి ప్రకాశరావు, సాంబశివరావు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌ను ప్రారంభించాలి



రేపల్లె: బీసీ వసతి గృహాన్ని ప్రారంభించి విద్యార్థులను ఆదుకోవాలని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావుకు వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు ఎంపీని కలసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. వసతి గృహాన్ని ప్రారంభిస్తే పేద విద్యార్థులకు మేలుచేకూరుతుందని వినతిపత్రంలో పేర్కొనారు. స్పందించిన మోపిదేవి అధికారులను సంప్రదించి సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆర్య, ఎస్ఎఫ్ఐ నాయకులు శివ, సూర్యప్రకాష్, సాయి పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో సత్తా చాటిన బాలికలు



బాపట్ల అర్బన్: రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో బాలికలు సత్తా చాటారు. విశాఖపట్నంలో గత నెల 28 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించిన అండర్- 19 బాలికల రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో గుంటూరు జిల్లా వాలీబాల్ జట్టు ద్వితీయ స్థానం సాధించింది. ఈ మేరకు కళాశాలల్లో మంగళవారం పోటీల్లో విజేతలుగా నిలిచిన బాపట్లకు చెందిన విద్యార్థినులు ఎం.జోష్న,ఎం.పావనిలను ఎస్ఎంజీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వేదవతి అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ అధ్యాపకులు వై.ఉదయభాస్కర్ పాల్గొన్నారు.

కళాకారుడికి సన్మానం

తెనాలి అర్బన్: ఎన్టీ రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో మంగళవారం శ్రీ మద్విరాటపర్వం చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. అనంతరం సాంఘిక, రంగస్థల కళాకారుడు, హాస్య నటుడు పినపాటి స్టీవెన్‌బాబును ఘనంగా సన్మానించారు.

పెన్షన్‌తో వృద్ధుల జీవన భద్రత పెంపు



రేపల్లెలో పెన్షన్ అందజేస్తున్న ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు



కర్లపాలెంలో నూతన పెన్షన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

రేపల్లె రూరల్: అవ్వా, తాతల మోముల్లో చిరునవ్వులు చూడటమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. స్థానిక పత్తిపాటి సీతారామ యోగిని కల్యాణ మండపంలో మండలంలో నూతనంగా మంజూరైన పెన్షన్‌ల పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ అవసన దశలో ఉన్న వృద్ధులకు పెన్షన్ సాయం ఎంతగానో ఉపయోగపడుతోందని చెప్పారు. అంతేకాకుండా వితంతువులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి పెన్షన్‌తో కొంత వరకు భద్రత ఉంటుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్న పథకాలలో భాగంగా పెన్షన్ కానుకను ఇచ్చిన మాట ప్రకారం పెంచారన్నారు. పెన్షన్‌ను పెంచిన ప్రతిసారి ప్రతిపక్ష నేత చంద్రబాబుకు, ఆయన బృంద సభ్యులకు పెన్షన్‌పై దుష్ప్రచారం చేయటం అలవాటుగా మారిందని విమర్శించారు. చంద్రబాబు అండ్ కో ఎన్ని కుయుక్తులు పన్నినా ప్రజలు అతడిని నమ్మే పరిస్థితుల్లో లేరని హితవు పలికారు. చంద్రబాబుకు గొప్పలు చెప్పుకోవటం అలవాటేనని, నాడు పాదయాత్ర సమయంలో జగన్‌మోహన్‌రెడ్డి రూ.3వేలకు పెన్షన్‌ను అందిస్తామని ప్రకటిస్తే చంద్రబాబు ఎన్నికలకు కేవలం ఒక నెల ముందుగా కంటి తుడుపు చర్యగా రూ.2వేలకు పెంచారన్నారు. అనంతరం ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి లబ్ధిదారులకు పెన్షన్‌ను విడతల వారీగా పెంపుదల చేస్తున్నారని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం నేడు రూ.2750 అందిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా మండలంలో నూతనంగా మంజూరైన 323 మంది లబ్ధిదారులకు పెన్షన్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు పీతా వెంకటేశ్వరరావు, రావు నెహ్రూ లక్ష్మీ ప్రభాకర్, ఇన్‌చార్జి ఎంపీడీఓ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

అర్హులందరికి పింఛన్ల ఘనత సీఎం జగన్‌దే : ఎమ్మెల్యే కోన రఘుపతి

కర్లపాలెం: రాష్ట్రంలో లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పింఛన్లు మంజూరు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతోందని ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నూతన పెన్షన్ల పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత పింఛను తీసుకునేందు ఉన్న 65 ఏళ్ల వయసును 60ఏళ్లకు తగ్గించి అర్హత ఉన్న అందరికీ పింఛన్లు మంజూరు చేసి వలంటీర్ల ద్వారా తెల్లవారుజామునే నగదు అందజేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు దొంతిబోయిన సీతారామిరెడ్డి, ఎంపీపీ యారం వనజ, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పందరబోయిన సుబ్బారావు, ఎంపీడీఓ ఎ.ఎలీషాబాబు, తహసీల్దార్ కేశవనారాయణరావు పాల్గొన్నారు.

పిట్టలవానిపాలెం: మండలంలోని ఖాజీపాలెంలో పెరిగిన వైఎస్సార్ పెన్షన్ కానుకను మంగళవారం పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కోన రఘుపతి హాజరయ్యారు. తొలుత సావిత్రీ బాయి పూలే చిత్ర పటానికి పూలమాలవేసి నివాళుర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు గోవతోటి సురేఖ, వైస్ ఎంపీపీ చేబ్రోలు కృపానందం, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు మండే విజయ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు కాగిత కాంతకుమారి, ఎంపీడీఓ పద్మజ పాల్గొన్నారు.

నేడు నూతన పెన్షన్ల పంపిణీ

చెరుకుపల్లి: మండలంలో నూతనంగా మంజూరైన పెన్షన్‌ల బుధవారం పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ బీ శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించనున్న కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు హాజరవుతారని చెప్పారు.

జగనన్న పాలనలో ప్రతి ఇంటా సంక్షేమమే



భట్టిప్రోలు మండలం వరికూటివారిపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పథకాలపై అవగాహన కల్పిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

- మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున
- వరికూటివారిపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం

గొరిగపూడి(భట్టిప్రోలు): ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి నేటి వరకు సంక్షేమ పథకాలను విజయవంతంగా కొనసాగిస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలోని వరికూటి వారిపాలెం, పెదవరికూటివారిలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి వివిధ సంక్షేమ పథకాల వలన చేకూరిన లబ్ధిని వివరిస్తూ ముందుకు సాగారు. దీనికి సంబంధించిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. సంక్షేమ పథకాల అమలు తీరును అధికారులు, ప్రజా ప్రతినిధులు అర్హులకు అందే విధంగా కృషి చేయాలన్నారు. గ్రామంలోని ప్రతి ఇంటికి ఆయన వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియ చేసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి నాగార్జున మాట్లాడుతూ రాష్ట్రంలో మూడేళ్ల నుంచి నిరంతరాయంగా జగనన్న సంక్షేమ యాత్ర కొనసాగుతుందని అన్నారు. పేదల జీవితాల్లో నింపుతున్న సంక్షేమ పథకాలు ఇలాగే కొనసాగాలంటే 2024లో జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులను గమనిస్తే పార్టీలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి పథకాలు అందాయని అర్థమవుతుందని చెప్పారు. తొలుత సర్పంచి గరిగపాటి మల్లిక, వైఎస్సార్ సీపీ నాయకులు వరికూటి వాసు, గరిగపాటి వెంకటేశ్వరరావు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు వరికూటి పున్నయ్య, సూరేపల్లి పీఏసీఎస్ చైర్‌పర్సన్ గోవర్ధనగిరి చినబుజ్జి, వేమూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ బొల్లిముంత ఏడు కొండలు, వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ ఇమామ్ హుసేన్, పార్టీ నాయకులు మాతంగి రవీంద్ర, వరికూటి రమేష్, యడ్లపల్లి శివనాగమల్లేశ్వరరావు, వరికూటి వెంకటేశ్వరరావు, వరికూటి ఆంజనేయులు, నీలా నాగరాజు, ఎన్.రమేష్, నన్నెపాముల శివకుమార్, వేల్పూరి నాగేశ్వరరావు, పెరికల శ్యామ్ పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి



బాపట్లలో పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీసీ సంఘాల నాయకులు



రేపల్లెలో నివాళులర్పిస్తున్న నాయకులు



కర్లపాలెంలో.. చిత్రపటం వద్ద నివాళి



అమృతలూరులో.. పూలే చిత్రపటం వద్ద నివాళి

బాపట్ల అర్బన్: మహిళలను విద్యావంతులను చేసేందుకు సావిత్రిబాయి పూలే విశేష కృషి చేశారని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కేసన శంకరరావు పేర్కొన్నారు. అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కేసన మాట్లాడుతూ భారతదేశంలోనే తొలి మహిళ పాఠశాలను ఏర్పాటు చేసిన తొలి మహిళ సావిత్రిబాయి పూలేనని పేర్కొన్నారు. ఫౌండేషన్ చైర్మన్ పఠాన్ రాజేష్ మాట్లాడుతూ తన సహోద్యాయని షేక్ ఫాతిమాతో కలిసి మనుధర్మ శాస్త్రాన్ని దిక్కరించి దేశంలోనే తొలి మహిళా పాఠశాలను ఏర్పాటు చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్.కె తాజుద్దీన్, పీరా సాహెబ్, ఖాదర్ బేగ్, అశ్విని, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే గొప్ప సంఘ సంస్కర్త

కర్లపాలెం: భారతదేశంలో గొప్ప మహిళా సంఘ సంస్కర్తగా సావిత్రిబాయి పూలే ఆదర్శంగా నిలిచారని అంబేడ్కర్ యువజన సేవా సమాఖ్య గౌరవ అధ్యక్షుడు మందపాటి పరమానందకుమార్ తెలిపారు. సావిత్రీబాయిపూలే జయంతి వేడుకలలో భాగంగా కర్లపాలెంలో ఆమె చిత్రపటం వద్ద పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పరమానందకుమార్ మాట్లాడుతూ మహిళ చదువులకు సావిత్రిబాయి పూలే కృషి చేశారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు పేరాల వెంకట సురేష్, ఉపాధ్యాయుడు ఇనకొల్లు పోలీస్‌రావు, పున్నారావు, వెంకటేశ్వర్లు ఉన్నారు.

రేపల్లె..

రేపల్లె: సావిత్రీబాయి పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని జైభీమ్ భారత్ పార్టీ బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ పెనుమాల సుబ్బారావు అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతిని పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం సెంటరులో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ రేపల్లె అసెంబ్లీ అభ్యర్థి దోవా రమేష్ రాంజీ, బలహీనవర్గాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ ఆంద్రాజు రామరాజు, అరుణశ్రీ వికలాంగుల సంఘం అధ్యక్షుడు జానం మురళీకృష్ణ, బీసీ నాయకులు సాయిబాబు, ఉపాధ్యాయులు ఆవుల సాంబశివరావు, రేపల్లె నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు జక్రయ్య, న్యాయవాది దారం సాంబశివరావు, బాబూరావు, శ్యాంబాబు, జోజిబాబు పాల్గొన్నారు.

సావిత్రి బాయి పూలే ఆదర్శనీయురాలు

భట్టిప్రోలు: దేశ తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రి బాయి పూలే ఆదర్శనీయురాలు అని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి పేర్కొన్నారు. భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో సావిత్రి బాయి పూలే జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటం వద్ద పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ లలిత కుమారి మాట్లాడుతూ సామాజిక రుగ్మతలపై సావిత్రిబాయ్ పూలే పోరాటం చేశారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, సూరేపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు గోవర్ధనగిరి శేషాచల శ్రీనివాసరావు(చినబుజ్జి), ఈఓపీఆర్డీ సీహెచ్ శేఖర్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు(నాని) పాల్గొన్నారు.

పిట్టలవానిపాలెంలో..

పిట్టలవానిపాలెం: సావిత్రీ బాయి పూలే జయంతిని పురస్కరించుకుని పిట్టువారిపాలెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు పరిశ నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు సావిత్రీ బాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయిని సన్మానించారు. విద్యార్థులతో సావిత్రీ బాయి పూలే జీవిత విశేషాలను ఇంగ్లిష్‌లో చదివించారు.

అమృతలూరులో..

అమృతలూరు(కొల్లూరు): నేటి తరానికి సంఘ సంస్కర్త, భారత తొలి మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జీవితం ఆదర్శనీయమని అమృతలూరు ఎంపీపీ రాపర్ల నరేంద్ర కుమార్ అన్నారు. మంగళవారం అమృతలూరు పంచాయతీ కార్యాలయంలో సర్పంచి దేవరకొండ రాము అధ్యక్షతన సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. తొలుత ఆమె చిత్రపటానికి పూలమాలలు వేచి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీఎం రాంబాబు, పంచాయతీ కార్యదర్శులు బి.అనీల్‌కుమార్, కె.భాస్కరరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు అంబటి రామ్మోహనరావు పాల్గొన్నారు.

అక్షర ఉపాధ్యాయ దంపతుల సన్మానం



బాపట్ల అర్బన్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో అక్షర ఉపాధ్యాయ దంపతులను సన్మానం చేయటం అభినందనీయమని ఆర్డీఓ రవీంద్రబాబు పేర్కొన్నారు. భార్యాభర్తలు ఉపాధ్యాయ వృత్తిలో సేవలు రాణిస్తున్న వారిని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో విద్యారంగానికి విశేష కృషి చేసిన 25మంది దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఏ భానుప్రతాప్, రెడ్‌క్రాస్ చైర్మన్ బి.ఎస్.నారాయణభట్టు, డాక్టరు వీరరాఘవయ్య రావూరి, పురం వెంకట సాంబశివరావు, సత్యవతి పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయంలో ఘనంగా హరిద్ర శృంగార్చన



పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో మంగళవారం 38వ వారం హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి మాట్లాడుతూ ప్రతి మంగళవారం వివాహం కాని ఆడపిల్లలకు ప్రత్యేకంగా హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పూజా కార్యక్రమం అనంతరం మహా గౌరీ హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, ఆలయ వంశ పారంపర్య అర్చకులు కుంచల బళ్లారెడ్డి, నరసారెడ్డి పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

చెరుకుపల్లి: పేకాట స్థావరంపై సెబ్ అధికారులు దాడి చేసి ఒకరిని అదుపులోకి తీసుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించిన ఘటన మండలంలోని గుళ్లపల్లిలో చోటుచేసుకుంది. నగరం సెబ్ సీఐ డి.శ్రీనివాసరావు వివరాల మేరకు.. గుళ్లపల్లి ఈఎస్ఆర్ నగర్‌లోని రైస్ మిల్ వెనుకాల పొలాల్లో పేకాటాడుతున్నట్లు వచ్చిన సమాచారంతో సెబ్ అధికారులు దాడి చేశారు. ముగ్గురు తప్పించుకోగా ఒకరిని అదుపులోకి తీసుకుని అతడి వద్ద నుంచి రూ.2,500, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



ట్యాబ్ అందజేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

పిట్టలవానిపాలెం: సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా తీర్చి దిద్దారని ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. మండలంలోని ఖాజీపాలెం మంతెన సుబ్బరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 60 మంది 8వ తరగతి విద్యార్థులకు మంగళవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 98 శాతం పైగా నెరవేర్చిన ఘనత జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు గోవతోటి సురేఖ, వైస్ ఎంపీపీ చేబ్రోలు కృపానందం, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు మండే విజయ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు కాగిత కాంత కుమారి, దొంతిరెడ్డి సింధు, చెన్నుబోయిన గంగయ్య, సర్పంచులు కుంతం అనూష ప్రసన్నరాజు, యేట్ర అశ్వినిరెడ్డి, మంతెన గంగరాజు, దబ్బకూటి మాధవరావు, శ్యామల నాగిరెడ్డి, బొలగాని అరుణకుమారి, సుబ్బారావు, కూసంపూడి దేవేంద్రరాజు, ఎనుముల కోటేశ్వరరావు, మునీర్, పారె ధనుంజయరావు, చేబ్రోలు రవికుమార్, చేబ్రోలు సురేష్, ఎనికేపల్లి శివకుమారి, ఎంపీడీఓ పద్మజ పాల్గొన్నారు.

సైక్లింగ్ పోటీలలో విద్యార్థికి బంగారు పతకాలు



బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు పృధ్వీరెడ్డితో హెచ్‌ఎం శ్రీనివాసరావు, పీఈటీ గోపి

కర్లపాలెం: చింతాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి కె.పృధ్వీరెడ్డి సైక్లింగ్ పోటీలలో బంగారు పతకాలు సాధించి జాతీయస్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికయ్యాడని ఆ పాఠశాల హెచ్‌ఎం డి.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం పాఠశాలలో పృధ్వీరెడ్డికి అభినందన సభ నిర్వహించారు. ఈసందర్భంగా పీఈటీ గోపి మాట్లాడుతూ గుంటూరు బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో ఇటీవల జరిగిన సైక్లింగ్ పోటీలలో మాస్ స్టార్ట్ విభాగంలోనూ, టైమ్ ట్రైల్స్ విభాగంలోనూ మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకాలు కైవసం చేసుకున్నాడని తెలిపారు. ఈనెల 7నుంచి 9వరకు మహారాష్ట్రలోని నాసిక్‌లో జరిగే అండర్-16 బాలుర విభాగంలో కె.పృధ్వీరెడ్డి సైక్లింగ్ పోటీలలో పాల్గొంటాడని గోపి తెలిపారు.

వైకుంఠ ద్వార దర్శనానికి బయలు దేరిన భక్తులు

చుండూరు(భట్టిప్రోలు): చుండూరు మండలం నడిగడ్డపాలెం ఎస్టీ కాలనీ వాసులు మంగళవారం సాయంత్రం స్వామి వారి శ్రీ వేంకటేశ్వరస్వామి వైకుంఠ ద్వార దర్శనానికి బస్సు బయలు దేరింది. శ్రీ వాణి ట్రస్ట్ తిరుమల తిరుపతి దేవస్థానాల ఆర్థిక సహాయంతో నిర్మించ తలపెట్టిన దేవాలయం నుంచి 49 మందితో వేమూరు సబ్‌డివిజన్ ధర్మ ప్రచారక్ ట్రాప రవి కుమార్ ఆధ్వర్యంలో బయలు దేరిన ఈ బస్సుకు ఎస్ఎస్ఎఫ్ మండల కన్వీనర్ చీడిపూడి వీరారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. టీటీడీ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ మత్స్యకారవాడల్లోని పేదలకు ఉచిత వైకుంఠ ఏకాదశి దర్శనానికి ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి రాయల సురేష్‌కుమార్, ఆర్ఎస్ఎస్ ప్రచార ప్రముఖ్ కారుమూరు వీరారెడ్డి, చేవూరి ప్రభుదాసు, మాణిక్యాల నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

లంక సాగు భూములు పరిశీలించిన జేసీ

కొల్లిపర: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొల్లిపర మండల పరిధిలో లంక సాగు భూములు ఎక్కడ ఉన్నాయి, వాటికి పట్టాలు ఇవ్వచ్చా లేదా అన్న అంశాలు పరిశీలిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి అన్నారు. మంగళవారం మండలంలోని అన్నవరపు లంక, బొమ్మువానిపాలెంలోని లంకసాగు భూములను తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలిశర్మ, తహసీల్దారు జి.నాంచారయ్య, ఎంపీడీఓ పి.శ్రీనివాసులు, మండల సర్వేయర్ శివప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో సుమారు లంక పంట భూములు 250 ఎకరాలు ఉన్నాయని, అవి ఎక్కడ నుంచి ఎక్కడ వరకు ఉన్నాయి, వాటి వివరాలు పరిశీలించడం జరుగుతుందని చెప్పారు. పరిశీలన అనంతరం ఈ వివరాలు పూరిస్థాయిలో నివేదికను తయారు చేసి త్వరలోనే ఉన్నత అధికారులకు అందజేయటం జరుగుతుందన్నారు. వారి వెంట డీటీ బాలకృష్ణారెడ్డి, ఆర్ఐ శ్రీనివాసరావు, వీఆర్ఓ బాను, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

మహాయజ్ఞ క్రతువు ప్రారంభం



తెనాలి టౌన్: పట్టణ వీఎస్ఆర్ కాలేజ్ రోడ్డులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై శరణాగతి పీఠం ఆధ్వర్యంలో నరేంద్ర దాస రామానుజస్వామి పర్యవేక్షణలో ధనుర్మాస వ్రత మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సుదర్శనలక్ష్మి నరసింహ మహాయజ్ఞం క్రతువు ప్రారంభించారు. విశ్వశాంతి కొరకు, పాడి పంటల సుభిక్షంగా ఉండాలని, లక్ష్మి నారసింహ క్రతువు ద్వారా సమాజ శ్రేయస్సు జరగాలని నరేంద్ర దాసస్వామి తెలిపారు. కార్యక్రమాన్ని యాజ్ఞిక బ్రహ్మ శ్రీమాన్ ముడుంబై శ్రీకాంత్ కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు.

చెట్లు తొలగించాలని వినతి



చైర్‌పర్సన్ ఖలేదా నసీమ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఈద్గా కమిటీ సభ్యులు

తెనాలి అర్బన్: చెంచుపేటలోని ఈద్గా ప్రహరీ వద్ద చెట్లు మొలచి గోడలు పగుల్లిచ్చాయని వాటిని వెంటనే తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని ఈద్గా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ గౌస్, సయ్యద్ బాషాలు మున్సిపల్ చైర్‌పర్సన్ ఖలేదా నసీమ్‌ను కోరారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలోని చైర్‌పర్సన్ చాంబర్‌లో ఆమెను కలిసి వినతిపత్రం అందజేశారు. కొద్ది నెలల్లో రంజాన్ మాసం రానున్నదని, ఆ రోజున పెద్ద సంఖ్యలో ముస్లింలు అక్కడ నమాజ్ చేసుకుంటారని గుర్తు చేశారు. చెట్లను తొలగిస్తే తాము ప్రహరీకి మరమ్మతులు చేయిస్తామని తెలిపారు. దీనిపై స్పందించిన చైర్‌పర్సన్ పరిశీలించి తగు చర్యలు తీసుంటామని హామీ ఇచ్చారు.